సాక్షి
కామారెడ్డి
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



బడిలో బతుకమ్మ సందడి
విద్యాసంస్థలలో మంగళవారం బతుకమ్మ పండుగ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడారు.
- 11లో ▸



పరీక్షించిన తర్వాతే..
ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ముందుగా నీటి పరీక్షలు చేయాలని అధికారులు సూచించారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /22.7

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారిగా శరత్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి శరత్ నియమితులయ్యారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు పర్యవేక్షణ కోసం ఆయనను ప్రత్యేక అధికారిగా నియమించారు.

డీవీఏహెచ్‌వోగా శ్రీనివాస్



కామారెడ్డి క్రైం: జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారిగా పి. శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో వరంగల్ డీవీఏహెచ్‌వోగా పని చేశారు. నూతన డీవీఏహెచ్‌వోను టీఎన్జీవోస్ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిజాంసాగర్‌లోకి తగ్గిన ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో మంగళవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను మూసివేసినట్లు నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఎగువ నుంచి 4,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1,404.92 అడుగుల (17.687 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

నేటి నుంచి స్కూళ్లకు సెలవులు

కామారెడ్డి టౌన్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. బుధవారం ప్రారంభమైన సెలవులు ఈనెల 14వ తేదీ వరకు సెలవులు కొనసాగనున్నాయి. 15వ తేదీన పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు సెలవులు పాటించాలని డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ ట్రెక్కింగ్ శిబిరానికి ఇద్దరి ఎంపిక



కామారెడ్డి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు వ్యాలీలో నిర్వహించే ఆలిండియా ట్రెక్కింగ్ క్యాంపునకు చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పదో తరగతి విద్యార్థి రాంచరణ్, తొమ్మిదో తరగతి విద్యార్థి రిషి క్యాంప్‌నకు ఎంపికయ్యారని పాఠశాల ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ప్రారంభమై 12 రోజులపాటు సాగే క్యాంప్‌లో పాల్గొనేందుకు తరలివెళ్లారని పేర్కొన్నారు. క్యాంప్‌నకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పండుగల నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కామారెడ్డి టౌన్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో నిజామాబాద్ రీజియన్ పరిధిలో 482 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి, కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డిల నుంచి జేబీఎస్ వరకు, జేబీఎస్ నుంచి నిజామాబాద్ వరకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం ప్రారంభమైన ప్రత్యేక సర్వీసులు ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

బస్సుల వివరాల కోసం సంప్రదించాల్సిన నంబర్లు..

డిపో	ఫోన్ నంబర్
కామారెడ్డి	84682 20281
బాన్సువాడ	94911 05706
నిజామాబాద్	99592 26022
ఆర్మూర్	73828 43133
బోధన్	98495 00725

సీడీసీ పీటముడి!

కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) చైర్మన్, డైరెక్టర్ల నియామకం విషయంలో పీటముడి ఏర్పడింది. ఒకే ఫ్యాక్టరీకి సంబంధించిన పాలకవర్గం నియామకం విషయంలో షబ్బీర్ అలీ, మదన్‌మోహన్‌రావు వేరువేరుగా ప్రతిపాదనలు పంపడంతో సర్కారు ఎటూ తేల్చలేక పెండింగ్‌లో పెట్టింది. ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఆశావహులకు ఎదురుచూపులు తప్పడం లేదు.



- చైర్మన్ పదవి కోసం ఇద్దరు నేతలనుంచి ప్రతిపాదనలు
- షబ్బీర్, మదన్‌మోహన్‌రావుల మధ్య కుదరని సయోధ్య
- ఎటూ తేల్చలేకపోతున్న మంత్రి
- పదవుల కోసం ఆశావహుల ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో రెండు చక్కెర కర్మాగారాలున్నాయి. నిజాంసాగర్ మండలం మాగిలోని గాయత్రి చక్కెర కర్మాగారానికి సంబంధించిన సీడీసీ పాలకవర్గం విషయంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పంపించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో మాగి సీడీసీ పాలకవర్గం బాధ్యతలు కూడా స్వీకరించింది. అడ్లూర్ ఎల్లారెడ్డి చక్కెర కర్మాగారానికి సంబంధించిన సీడీసీ నియామకంపై మాత్రం చిక్కుముడి ఏర్పడింది. అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి చక్కెర కర్మాగారం ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో ఉంది. దీంతో ఈ కర్మాగారానికి సంబంధించిన కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీడీసీ) పాలకవర్గం నియామకం కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆగస్టు 26న పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రతిపాదనలు పంపించారు. చైర్మన్ స్థానానికి అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్ ఇర్షాదుద్దీన్ పేరును, డైరెక్టర్ స్థానాలకు వెంకంపల్లికి చెందిన ఆకిడి పీర్‌రెడ్డి, లింగంపేట మండలం మోతె గ్రామానికి చెందిన గడ్డం నరేందర్‌రెడ్డి పేర్లను సూచించారు. అయితే సీడీసీ కార్యాలయం కామారెడ్డిలో ఉండడంతో పాటు, ఫ్యాక్టరీ పరిధిలో ఎక్కువ చెరుకు సాగయ్యేది కూడా కామారెడ్డి నియోజకవర్గంలో కావడంతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కూడా సీడీసీ చైర్మన్ పేరుకు ప్రతిపాదనలు పంపారు. దోమకొండకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనంతరెడ్డిని చైర్మన్ పదవికి సూచించారు. దీనికి ఎంపీ సురేశ్ షెట్కార్ సహకారం కూడా తీసుకున్నారని సమాచారం. దీంతో ఎవరి ప్రతిపాదనలను ఓకే చేయాలన్న దానిపై మంత్రి సందిగ్ధంలో పడిపోయినట్టు తెలుస్తోంది. ఇద్దరు నేతలు మాట్లాడుకుని పేర్లు ఇవ్వాలని సూచించగా రెండువైపుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో మంత్రి ఎటూ తేల్చలేక ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. దీంతో సీడీసీ చైర్మన్, డైరెక్టర్ల నియామకానికి బ్రేక్ పడినట్టయ్యింది.

శ్రేణుల్లో గందరగోళం

కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలు కలిసి ఉంటాయి. రామారెడ్డి, రాజంపేట మండలాల్లో రెండు నియోజకవర్గాలకు చెందిన గ్రామాలు ఉండడం వల్ల ఆయా మండలాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం కూడా వివాదాలకు కారణమవుతుంది. ఒక్కో మండలానికి ఇద్దరు అధ్యక్షులు ఉన్నారు. దీంతో ఆయా మండలాల్లో నాయకులు రెండు గ్రూపులుగా విడిపోతున్నారు. దీని ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పడుతుందని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

ఎదురుచూపులు ఫలించేదెప్పుడో?

ఇద్దరు ముఖ్య నేతల మధ్య నెలకొన్న విభేదాలతో పార్టీ శ్రేణులు గందరగోళానికి గురవుతున్నాయి. సీడీసీ చైర్మన్, డైరెక్టర్ పదవులు ఆశిస్తున్నవారు ఇబ్బందిపడుతున్నారు. ముఖ్య నేతల మధ్య సయోధ్య కుదిరితేనే ఆశావహుల కలలు నెరవేరనున్నాయి.

ఇద్దరి మధ్య విభేదాలు..

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మధ్య చాలా కాలంగా విభేదాలున్నాయి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసి స్వల్ప తేడాతో మదన్‌మోహన్‌రావు ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికలు ముగిసిన తర్వాత కొంత కాలానికే ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక సమయంలో మదన్‌మోహన్‌రావు దూకుడుగా వ్యవహరించి ఆన్‌లైన్ పోటీలో షబ్బీర్ అలీ తనయుడు ఇలియాస్‌ను ఓడించడంలో కీలకపాత్ర పోషించడంతో విభేదాలు మరింత ముదిరాయని చెబుతారు. దీంతో ఇరువురు నేతల మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. ఎంపీగా ఓడిపోయిన తర్వాత మదన్‌మోహన్‌రావు ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం మీద దృష్టి సారించి, పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే అప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జీగా సుభాష్‌రెడ్డి ఉండడంతో పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గాంధారిలో నిర్వహించిన జోడో యాత్రలో అప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ షబ్బీర్ అలీ సూచించినవారికే ఎల్లారెడ్డి టికెట్టు ఇస్తామని ప్రకటించారు. అయితే టికెట్టు కేటాయించడానికి షబ్బీర్ అలీ ఎవరంటూ మదన్‌మోహన్‌రావు ఎదురుదాడికి దిగారు. జాతీయ స్థాయి నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో టికెట్టు సాధించి షబ్బీర్ అలీపై పైచేయి సాధించారు.

జాబితా కోసం రోజంతా నిరీక్షణ

- రాత్రి వెలువడిన మెరిట్ లిస్ట్
- అభ్యర్థుల ఫోన్‌లు, మెయిల్‌లకు సందేశాలు
- నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

కామారెడ్డి టౌన్: డీఎస్సీ మెరిట్ లిస్ట్ విడుదలలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందారు. జిల్లాలో 506 పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నిర్వహించారు. ఫలితాలు సోమవారం వెలువడిన విషయం తెలిసిందే. అయితే షెడ్యూల్ ప్రకారం మంగళవారంనుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఫలితాలు వెలువడినా.. మెరిట్ లిస్ట్ రాలేదు. 1:3 మెరిట్ లిస్ట్ మంగళవారం రాత్రి విడుదలయ్యింది. కేటగిరీలవారీగా మెరిట్ లిస్ట్‌ను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 1:3లో ఎంపికైనవారి ఫోన్ నంబర్లు, మెయిల్ అడ్రస్‌లకు సందేశాలు పంపించారు.

9న నియామక పత్రాలు..

కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం రూం నంబర్ 223లో బుధవారం నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని డీఈవో రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందించనున్నారు.

‘సామాజిక సేవలో ముందుండాలి’



వృద్ధుడిని సన్మానిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: సామాజిక సేవలో వయోవృద్ధులు ముందుండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వయోవృద్ధుల ఫోరం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. రోజూ వాకింగ్, యోగా, వ్యాయామం చేయాలన్నారు. తల్లిదండ్రులను సరిగా చూడని, పోషించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సందర్భంగా వృద్ధులకు యోగా, వాకింగ్, క్యారం పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ జ్ఞాపికలు అందించారు. పలువురు వృద్ధులను శాలువాలతో సత్కరించారు. అనంతరం వృద్ధుల సంక్షేమ ఫోరం ఆవరణలో కలెక్టర్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వృద్ధుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

10 లక్షలతో పోస్టల్ ఉద్యోగి పరార్

- పోలీసులకు ఫిర్యాదు

బీబీపేట: పోస్టల్ శాఖలో పనిచేస్తూ మూడు నెలల క్రితం సస్పెన్షన్‌కు గురైన ఓ ఉద్యోగి.. రూ. 10 లక్షల పెన్షన్ డబ్బులతో పరారయ్యాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వర్ని మండలం సిద్దులం తండాకు చెందిన దేవిసోత్ బిక్యా నాయక్ తుజాల్‌పూర్ గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసేవాడు. పోస్టాఫీస్ డబ్బులను పక్కదారి పట్టించిన విషయంలో జూన్ 6న సస్పెన్షన్‌కు గురయ్యాడు. దీంతో ఇస్సానగర్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బట్టు అనిల్‌కు తుజాల్‌పూర్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గతనెల 30న ఇస్సానగర్, తుజాల్‌పూర్ గ్రామాలకు సంబంధించిన చేయూత పెన్షన్ పంపిణీ కోసం బట్టు అనిల్ రూ. 10 లక్షలు బీబీపేట సబ్ పోస్టాఫీస్ నుంచి తీసుకున్నాడు. ఆ డబ్బులను బీబీపేటలో బిక్యా నాయక్ అద్దెకు ఉంటున్న ఇంట్లో భద్రపరిచి, ఇస్సానగర్ వెళ్లాడు. మంగళవారం ఉదయం పెన్షన్లు పంపిణీ చేయడం కోసం బిక్యా గదికి వెళ్లగా.. తాళం వేసి ఉంది. అతడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వస్తుండడంతో ఆందోళనతో పోస్టల్ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. బిక్యాతోపాటు అతడి స్నేహితుడు సురేశ్ డబ్బులు తీసుకుని పారిపోయారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీబీపేట సబ్ పోస్టుమాస్టర్ నర్సింలు ఫిర్యాదు చేశారని ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

అసంపూర్తిగా సఖి భవనం!



జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న సఖి భవన నిర్మాణం

- భరోసాకు స్థలం కేటాయింపుతోనే సరి
- అద్దె భవనంలోనే కొనసాగుతున్న కార్యాలయాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: లైంగిక వేధింపులకు గురైన బాలికలకు కొంతకాలం ఆశ్రయం కల్పించడానికి ఉద్దేశించిన ‘సఖి’, భరోసా, బాలరక్ష భవన్‌లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన సమయంలో జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయాలకు భవనాలు నిర్మించింది. లైంగిక దాడులకు సంబంధించిన కేసుల్లో బాధితులకు భరోసా ఇవ్వడానికి జిల్లా యంత్రాంగం సఖి, భరోసా, బాలరక్ష కార్యాలయాలు ఏర్పాటు చేసింది. జిల్లా పోలీస్ కార్యాలయం పక్కనే సఖి కార్యాలయానికి రూ.40 లక్షలతో భవన నిర్మాణం చేపట్టినా.. ఇంకా అసంపూర్తిగానే ఉంది. అక్కడే భరోసా కార్యాలయానికి స్థలం కేటాయించినప్పటికీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. బాలరక్షకు అసలు స్థలం కూడా కేటాయించలేదు. దీంతో మూడు కార్యాలయాలూ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సఖి కేంద్రం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతున్నాయి. వాటికి సంబంధించిన కేసులు ఆయా కేంద్రాలకు రెగ్యులర్‌గా వస్తాయి. వాటిని పర్యవేక్షించడానికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



భరోసా కేంద్రానికి కేటాయించిన స్థలం

పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

- ప్రతి కుటుంబానికి ‘ఫ్యామిలీ డిజిటల్ కార్డు’
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు గ్రామ పంచాయతీలు, పట్టణ ప్రాంతం ఉన్నట్లయితే ఒక జీపీతో పాటు పట్టణంలోని ఒక వార్డును యూనిట్‌గా గుర్తించి, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పన కోసం సర్వే చేపట్టాలన్నారు. గురువారంనుంచి సర్వే ప్రారంభించాలన్నారు. సర్వేలో గుర్తించిన అంశాలపై 8వ తేదీ సాయంత్రం వరకు నివేదిక అందించాలని సూచించారు. అనంతరం ఆయా అంశాలను పరిష్కరించి, రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ కార్డులను అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమానికి ఈ కార్డు కీలకం అవుతుందన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పర్యవేక్షణకు ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్–2020కి సంబంధించి దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉండడానికి కారణాలను తెలియజేయాలని ఆదేశించారు. ఇంకా కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి దసరా కన్నా ముందే లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. జనవరినుంచి రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మహిళల పేరుతో ఫ్యామిలీ డిజిటల్ కార్డు

కుటుంబంలో ఉన్న మహిళ పేరు మీద ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఒక వ్యక్తి ఒకే కుటుంబం కార్డులో ఉండేలా చూడాలన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందించాలన్నారు. ప్రస్తుతం ఉన్న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల విస్తరణ, నూతన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల రూపకల్పనకు సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్‌లను ఆదేశించారు. అక్టోబర్ 15 నాటికి పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అవసరమైన మౌలిక వసతులను కల్పించాలన్నారు. సన్న ధాన్యం, దొడ్డు ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, డీపీవో శ్రీనివాస్‌రావు, ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

‘సోయా పంటను పూర్తిగా కొనుగోలు చేస్తాం’

వేల్పూర్: జిల్లాలో సోయాబిన్ పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తిగా కొంటామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డితో కలిసి సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సోయాబిన్ పంటను 12 శాతం తేమ వచ్చేటట్లు ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేశారన్నారు. రైతులు పండించిన సోయాబిన్ పంటను పూర్తిగా కొనుగోలు చేసేవరకు కేంద్రాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, ఎంపీఏ సుభాష్ పాల్గొన్నారు.

‘విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటాలి’



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీపీవో శ్రీనివాస్‌రావు

మాచారెడ్డి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని కామారెడ్డి డీపీవో శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం సోమారంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గోపి బాబు, ఎంఈవో సురభి దేవేందర్ రావు, ఎస్‌జీఎఫ్ సెలెక్షన్స్ కన్వీనర్, హెచ్‌ఎం సుర భాస్కర్, ప్రధానోపాధ్యాయులు వెంకటాచారి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 40604 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ఆరు వరద గేట్ల ద్వారా గోదావరికి 18,744 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు కోసం కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 6800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాలువ ద్వారా 150, ఆవిరి రూపంలో 709, వరద కాలువ ద్వారా 12వేలు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

గమ్మత్తయిన లాటరీ

- మేక, కోళ్లు, మద్యం బహుమతులు



రుద్రూర్: దసరా పండుగను పురస్కరించుకుని పొతంగల్ కొడిచర్ల గ్రామానికి చెందిన యువకులు గమ్మత్తైన లాటరీ ఏర్పాటు చేశారు. రూ. వంద కొట్టు.. మేకను పట్టు అని కొడిచర్ల గ్రామస్తులకు దసరా స్పెషల్ ఆఫర్ ఇస్తున్నట్లు క్యాప్షన్ పెట్టి టికెట్ల విక్రయాలు జరుపుతున్నారు. లాటరీ ధర రూ. వంద. లాటరీ విజేతలకు బహుమతులుగా ప్రథమ బహుమతి మేక, రెండో బహుమతి రెండు బ్లెండర్ స్ప్రైడ్ ఫుల్ బాటిళ్లు, మూడో బహుమతి కాటన్ బీర్లు, నాలుగో బహుమతిగా రెండు నాటు కోళ్లు, ఐదో బహుమతిగా ఒక రాయల్ స్టగ్ ఫుల్ బాటిల్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీన్ని చూసిన గ్రామస్తులు అధిక సంఖ్యలో వీటిలో కొనుగోలు చేస్తున్నారు.

కాపర్ కేటుగాళ్లు..



నందిపేటలో దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

- పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు భద్రత కరువు
- కాపర్ వైరు ఎత్తుకెళ్తున్న దొంగలు
- ఏడాదిలో 31 ట్రాన్స్‌ఫార్మర్స్ ధ్వంసం
- అదనపు భారంతో ఇబ్బందుల్లో రైతులు

నందిపేట్: జిల్లాలో కాపర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. పొల్లాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తూ అందులోని కాపర్ తీగలను, ఆయిల్‌ను అపహరిస్తున్నారు. జిల్లాలో గత రెండేళ్లుగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లలను ధ్వంసం చేస్తూ వచ్చే కొద్దిపాటి ధనానికి ఇటు రైతులకు, అటు విద్యుత్ శాఖకు నష్టాన్ని మిగిలుస్తున్నారు. గతంలో వీటిని ముట్టాలంటేనే భయపడేవారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసే కేటుగాళ్లు ఇందులో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి కాపర్ వైర్లను దొంగిలిస్తున్నారు.

వందల సంఖ్యలో..

గత రెండేళ్లలో జిల్లాలో సుమారు 150 వరకు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలను దుండగులు దొంగిలించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 31 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. చిన్న ట్రాన్స్‌ఫార్మర్లలో 8 నుంచి 10 కిలోల రాగి తీగ ఉంటే, పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లలో 15 నుంచి 20 కిలోల వరకు రాగి తీగలు ఉంటాయి. మార్కెట్లో రాగితీగ కిలో రూ. 400 నుంచి రూ. 500 వరకు ధర పలుకుతోంది. కానీ ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసంతో విద్యుత్తు శాఖకు రూ.15 వేలు నష్టం వాటిల్లుతోంది. కాపర్ తీగలను ఏర్పాటు చేసి మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలంటే సుమారు రూ. 30 వేల వరకు భారం పడుతోంది. ఇళ్లలో దొంగతనం రిస్కుతో కూడుకున్న పని కావడంతో కష్టపడకుండా సులువుగా దొంగతనం చేసే మార్గం కావడంతో కేటుగాళ్లు వీటిపై దృష్టిసారించినట్లు జరిగిన ఘటనల ఆధారంగా తెలుస్తోంది.

గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి

టాన్స్‌ఫార్మర్ల చోరీలను నియంత్రించాలంటే రైతులు విద్యుత్తు శాఖ సిబ్బందికి సహకారం అందిస్తూ.. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తే దొంగతనాలను నివారించవచ్చు. విద్యుత్ అధికారులు సైతం ట్రాన్స్‌ఫార్మర్‌లకు నట్ బోల్టులకు బదులుగా వెల్డింగ్ చేస్తే దొంగల ముఠాకు కష్టంగా మారుతుంది. ఈ విధంగా చేస్తే కొంతవరకైనా దొంగతనాలు నివారించవచ్చు.

చర్యలు తీసుకుంటున్నాం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతలకు వచ్చే ట్రాన్స్‌ఫార్మర్ మూతల చుట్టూ వెల్డింగ్ చేసేలా చర్యలు చేపడుతున్నాం. దొంగతనాల నివారణకు రైతులు, గ్రామ కమిటీ సభ్యులు విద్యుత్ శాఖకు సహకారం అందించాలి.

– రవీందర్, ఎస్ఈ, ట్రాన్స్‌కో

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి మహిళ, పురుషుల హ్యాండ్ బాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగమోహన్ చక్రు, పింజ సురేందర్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం పురుషుల విభాగంలో 50, మహిళల విభాగంలో 30 మంది హాజరయ్యారని తెలిపారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 9, 10,11వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే 53వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళా హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేశ్, పీఈటీలు సంజీవ్, రాజేందర్, ప్రిన్సిపాల్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులు

డీఎస్సీ ఫలితాల్లో భార్యాభర్తల ప్రతిభ



శ్యామ్‌రాజు అరుణ

భిక్కనూరు: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో భార్యాభర్తలు అత్యుత్తమ ప్రతిభ చాటారు. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన భార్యాభర్తలు శ్యామ్‌రాజు–అరుణ దంపతులు సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించారు. వీరు ఎస్జీటీలుగా ఉద్యోగాలు పొందనున్నారు.. శ్యామ్‌రాజు కామారెడ్డి జిల్లాలో తెలుగు విభాగంలో 73.13 మార్కులు సాధించి జిల్లాలో నాలుగో ర్యాంకు సాధించగా ఆయన భార్య అరుణ మెదక్ జిల్లాలో తెలుగు విభాగంలో 64.23 మార్కులు సాధించి ఆ జిల్లాలో ఐదో ర్యాంక్ సాధించింది.

కానిస్టేబుల్ టు టీచర్



వసీం పటేల్

బాన్సువాడ: బాన్సు వాడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వసీం డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చూపాడు. ఫలితాలలో వసీంకు స్కూల్ అసిస్టెంట్(సోషల్) విభాగంలో రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు సాధించాడు. వసీం జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వసీం ఆరేళ్లుగా బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌లో పని చేసి ఇటీవల బాన్సువాడకు బదిలీ అయ్యారు. కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక కావడంతో పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపిక



కమ్మరి శ్రీకాంత్



వేణు కుమార్

భిక్కనూరు: డీఎస్సీ ఫలితాల్లో భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన ఉప్పరి వేణు కుమార్ 81.90 మార్కులు సాధించి మూడో ర్యాంక్(గణిత విభాగంలో) సాధించాడు. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన కమ్మరి శ్రీకాంత్ మూడవ ర్యాంక్(ఇంగ్లిష్ విభాగంలో) సాధించాడు. ఇరువురూ ఎస్జీటీలుగా ఉద్యోగాలు పొందనున్నారు.

జిల్లా టాపర్‌గా స్వామి



కొయ్యల స్వామి

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన కొయ్యల స్వామి డీఎస్సీ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచాడు. స్వామికి 79.83 మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి ర్యాంకు(తెలుగు పండితుడు)లో నిలువడంతో గ్రామస్తులు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎల్లారెడ్డి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం అడివిలింగాల గ్రామంలో పలు కాలనీలను పరిశీలించారు. ఇంటి ఆవరణలో మురికి నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యదర్శి తదితరులున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



బీబీపేట: మండల కేంద్రం నుంచి మల్కాపూర్ వెళ్లే రోడ్డులో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గత నెల 30న సాక్షిలో ప్రచురితమైన 'మూలమలుపుల్లో ముళ్ల పొదలు' కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి సతీష్ యాదవ్ రోడ్డును పరిశీలించి సిబ్బంది సహాయంతో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ తదితరులున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

పరీక్షించిన తర్వాతే నీటిని సరఫరా చేయాలి

బాన్సువాడ: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ముందుగా నీటి పరీక్షలు చేసిన తర్వాతే సరఫరా చేయాలని మిషన్ భగీరథ డీఈ వెంకటేష్ గౌడ్ సూచించారు. బీర్కూర్ మండలం రైతునగర్ జీపీ కార్యాలయంలో కొనసాగుతున్న గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.పైపు లైను లీకేజీలు ఉంటే కార్యదర్శిలకు తెలియజేయాలని అన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. మిషన్ భగీరథ ఏఈలు జగదీష్, అశ్విని, ల్యాబ్ టెక్నిషియన్లు రమేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బిచ్కుందలో శిక్షణ

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపాల్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. అధికారి రాచప్ప, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈ వెంకటేష్‌గౌడ్

పెద్దల అమావాస్యకు పెద్ద చిక్కు



ఎల్లారెడ్డిలో జనాలతో కిటకిటలాడుతున్న మటన్ మార్కెట్

కామారెడ్డిరూరల్/ఎల్లారెడ్డిరూరల్/భిక్కనూరు: సంవత్సరానికి ఒక్కసారి పెద్దలకు నైవేద్యం పెట్టుకునే పెద్దల అమావాస్యకు పెద్ద చిక్కు వచ్చి పడింది. బుధవారం రోజే గాంధీ జయంతి రావడంతో ప్రజలకు ఇబ్బంది తలెత్తింది. సాధారణంగా ఆ రోజున చికెన్, మటన్, మందు దుకాణాలు తెరవరు. బంద్ ఉంటుందని తెలియడంతో చాలా మంది మంగళవారమే వైన్, మటన్, చికెన్ షాపుల మీద పడ్డారు. దీంతో షాపులు కిక్కిరిపోయాయి. సందట్లో సడేమియాగా రేట్లు కూడా బాగా పెంచారు. ముందుగానే వీటిని కొనుగోలు చేసి ఇళ్లలో పెట్టుకుంటున్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు



లింగంపేటలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఏఈవోలు



నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట/లింగంపేట(ఎల్లారెడ్డి): డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని తమపై ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకురావడాన్ని నిరసిస్తూ నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల్లో ఏఈవోలు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఈవోలు 5 నుంచి 8 గ్రామాలలో 6 వేల నుంచి 10 వేల ఎకరాల వరకు డిజిటల్ క్రాప్ సర్వే చేయడం కష్టంతో కూడుకున్న పని అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే కోసం గ్రామాలలో సహాయకులను నియమించాలని కోరారు.

రుణమాఫీ ప్రతి రైతుకు వర్తింపజేయాలి



భిక్కనూరు: ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా వర్తింపజేయాలని అంతంపల్లి సింగిల్ విండోలో రైతులు తీర్మానించారు. మంగళవారం విండో చైర్మన్ వలకొండ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన 59వ విండో మహాజనసభ నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులు పలు తీర్మానాలను ఆమోదించారు. విండో మాజీ చైర్మన్లు కిషన్‌రావు, ఏన్గు రాంరెడ్డి వైస్ చైర్మన్ రాజిరెడ్డి, సీఈవో శ్రీనివాస్, రైతు సమన్వయసమితి గ్రామ కో–ఆర్డినేటర్ అలకొండ గంగారెడ్డి వీడీసీ అధ్యక్షుడు అమృత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని నాగారంలో ఉన్న రాజారాం స్టేడియంలో ఈ నెల 3న గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో బాలుర జట్టుకు ఎంపికలు నిర్వహించనున్నట్లు డీఐఈవో రవికుమార్ మంగళవారం పేర్కొన్నారు. ఇంటర్ చదివే క్రీడాకారులు బోనాఫైడ్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9441631631 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

తల్లిని చంపిన కొడుకుకు మూడేళ్ల జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: తల్లిని చంపిన కొడుకుకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దకొడప్‌గల్‌కు చెందిన వడ్డె నాగవ్వ(48) 2021మార్చి31న దారుణ హత్యకు గురైంది. డబ్బులు అడిగితే ఇవ్వలేదని మద్యానికి బానిసైన ఆమె కొడుకు నర్సింలు కన్న తల్లి అని కూడా చూడకుండా కర్రతో దాడి చేసి హతమార్చాడని పోలీసుల విచారణలో తేలింది. అప్పట్లోనే పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ నిందితుడు నర్సింలుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. కేసును విచారించిన బిచ్కుంద సీఐలు చంద్రశేఖర్, నరేశ్‌కుమార్, ఎస్సై విజయ్ కొండ, మహేందర్, మురళి, పీపీ రాజగోపాల్ గౌడ్, పోలీసు సిబ్బంది మురళీకృష్ణ, విక్రంరెడ్డిలను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

బిచ్కుంద: మండల కేంద్రంలో గత నెల 29న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం బిచ్కుంద పీఎస్‌లో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బిచ్కుందకు చెందిన గుడ్లింగం పండరి మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. అదే ప్రాంతానికి చెందిన గోనె కాశవ్వ గత నెల 29న ఇంట్లో ఒక్కరే ఉన్నట్లు గుర్తించి ఆమె మెడలో ఉన్న బంగారాన్ని దొంగిలించి రోకలి బండతో ఆమె తలపై బలంగా కొట్టాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు పండరిగా పోలీసులు గుర్తించారు. పండరి ఫత్లాపూర్ దాబా వద్ద ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి పట్టుకున్నారు. విచారణలో కాశవ్వను హత్య చేసి బంగారం చోరీ చేసినట్లు పండరి నిజం ఒప్పుకున్నాడు. బంగారు నగలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

దూదిగాంలో చైన్ స్నాచింగ్

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం వద్ద ఓ మహిళ మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా గొల్లపేట్‌కు చెందిన సంద స్వప్న తన కుమారుడిని దూదిగాంలో ఉన్న సీఎస్ఐ హాస్టల్ నుంచి దసరా సెలవుల కోసం ఇంటికి తీసుకెళ్లేందుకు మంగళవారం మధ్యాహ్నం వచ్చింది. ఈ క్రమంలో జాతీయ రహదారి 44 రోడ్డును క్రాస్ చేసేందుకు నిర్మించిన వంతెన కిందకు రాగానే వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట: మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన కత్తూరి కిషన్ పాడి గేదె మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రోజువారిగా గ్రామ శివారులోని పంట చేనుల్లో మేతకు వెళ్లిన గేదెపై సర్వీసు వైరు తెగిపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ట్రాన్స్‌కో అధికారులు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

బోధన్‌లో ఆవుల చోరీకి విఫలయత్నం

బోధన్‌రూరల్: పట్టణంలోని శ్రీచక్రేశ్వర శివాలయం సమీపంలోని ఏకచక్రేశ్వర గోశాలకు చెందిన మూడు ఆవులను దుండగులు మత్తుమందు ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఘటన బోధన్ పట్టణంలో మంగళవారం కలకలం రేపింది. ఘటనకు సంబంధించి చక్రేశ్వర గోశాల ప్రతినిధులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గోశాలలోని ఆవులు ఆలయ సమీపంలోని డివైడర్లకు ఇరువైపులా సంచరిస్తు నిద్రిస్తుంటాయి. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో రోడ్డుపై నిద్రిస్తున్న మూడు ఆవులను దుండగులు మత్తు మందు ఇచ్చి ఓ వాహనంలో ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. గమనించిన చుట్టపక్కల వారు కేకలు వేసి గోశాల ప్రతినిధులకు సమాచారం అందించారు. వెంటనే గోశాల అధ్యక్షుడు నేపాల్ సింగ్, ప్రతినిధులు అక్కడికి చేరుకోగా దుండగులు వెంట తెచ్చుకున్న వాహనంతో అక్కడి నుంచి పరారయ్యారు. మత్తు మందుతో మూడు ఆవులు అపస్మారకస్థితిలో ఉన్నట్లు గుర్తించిన గోశాల ప్రతినిధులు వెంటనే గోపాలమిత్ర వారిని పిలిపించి చికిత్స అందించారు. ఈ విషయమై గోరక్ష సేవా సమితి అధ్యక్షుడు నేపాల్ సింగ్, ప్రధాన కార్యదర్శి వినోద్ పట్వారీ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ వెంకటనారాయణ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని, సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



ఆవులకు వైద్యం అందిస్తున్న వైద్యులు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

రాజంపేట: మండలంలోని గుండారంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ అధికారులు మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. కొంతకాలంగా సదురు ట్రాక్టర్ యజమాని రాజకీయ నాయకుల అండతో ఇసుక అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై కామారెడ్డి ఫారెస్ట్ అధికారి రమేశ్‌ను వివరణ కోరగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నది వాస్తవమేనని పేర్కొన్నారు.

ఎన్‌బురి శివారులో..

మద్నూర్(జుక్కల్): డోంగ్లి మండలంలోని ఎన్‌బురి శివారులో 20 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకొని సీజ్ చేశారు. అక్రమంగా డంప్ చేసిన ఇసుక కుప్పలకు ఈ నెల 3న డోంగ్లిలోని తహసీల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రేణుక చౌహాన్ పేర్కొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్

చేపల వేటలో వివాదం

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువలో చేపల వేట కోసం కొంత కాలంగా మత్స్యకారుల మధ్య వివాదం జరుగుతుండడంతో మత్స్యశాఖ ఏడీ ఆంజనేయులు కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను మంగళవారం పరిశీలించారు. ముప్కాల్ మండల శివారులోని వరద కాలువలో ముప్కాల్ గ్రామస్తులు కాకుండా ఇతర గ్రామస్తులు చేపల వేట కొనసాగద్దని వివాదం జరుగుతోంది. సమస్యను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా అధికారితో ఇరువర్గాల మత్స్యకారులు వాగ్వాద పడ్డారు. అసలు వరద కాలువ బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులో ఉందని మత్స్యకారులు కొందరు వాదించారు. దీంతో ల్యాండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌కు అప్పగించి, సర్వే చేయిస్తామని ఏడీ తెలిపారు. సమస్య పరిష్కారానికి ఇరువర్గాల మత్స్యకారులు సహకరించాలని కోరారు.



ఏడీఏతో వాగ్వాదం చేస్తున్న మత్స్యకారులు

అక్రమంగా మొరం తవ్వకాలు జరిపితే చర్యలు



ఎల్లారెడ్డి: అక్రమంగా మొరం తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మన్నె ప్రభాకర్ హెచ్చరించారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట శివారులో గల పందిరేసే కుచ్చ ప్రాంతాన్ని ఆర్డీవో పరిశీలించారు. కుచ్చ ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



నిజాంసాగర్(జుక్కల్): పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బాన్సువాడ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం నర్వ జీపీని ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించా రు. మండల పంచాయతీ అధికారిణి అనిత, పంచాయతీ కార్యదర్శి బలరాముడు, కారోబార్ ప్రభాకర్ ఉన్నారు.

రచయితల మరణం సాహిత్య రంగానికి తీరని లోటు



కామారెడ్డి టౌన్: జిల్లాకు చెందని ప్రముఖ రచయితలు ఆయాచితం నటేశ్వరశర్మ, రాజేశ్వర శర్మల మరణం సాహిత్య రంగానికి తీరని లోటని తెలంగాణ రచయితల సంఘం ప్రతినిధులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో వారి సంస్మరణ సభ నిర్వహించారు. వారు రాసిన రచనలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి, కార్యదర్శి ప్రకాష్, ప్రతినిధులు సిరిగాధ శంకర్, అశోక్, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బాన్సువాడ కోర్టులో శ్రమదానం



బాన్సువాడ: బాన్సువాడ సివిల్ కోర్టులో మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. జడ్జి కుమారి టీఎస్‌పీ భార్గవి, ఏజీపీ ఖలీల్, న్యాయవాదులు భూషణ్‌రెడ్డి, రమాకాంత్, రాంరెడ్డి, తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 2, 3 ఆధ్వర్యంలో వాలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. వీరితో పాటు బాన్సువాడ పట్టణానికి చెందిన రిలయన్స్‌స్మార్ట్, ట్రెండ్స్ వస్త్ర వ్యాపార సంస్థల సిబ్బంది శ్రమదానంలో పాల్గొని కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.